


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :112 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ ఆదివారం 16-08-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

## మహానుభావుల ప్రాణ త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత



ములుగు : ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగంతోనే దేశానికి స్వాతంత్రం వచ్చిందని, మహానుభావుల త్యాగాలను ఎన్నటికీ మరువద్దని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. రాష్ట్రంలో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని, గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ ఫలాలు అర్హులకు అందించడం జరుగుతుందని వివరించారు. శనివారం 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలోని తంగేడి మైదానంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈనెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాకు వస్తున్న సందర్భంగా మేడారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆహార భద్రతను మరింత పటిష్టం చేయడానికి క్యూఆర్ కోడ్ నూతన రేషన్ కార్డులు, చేయూత పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుందని అన్నారు.ములుగు జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణించి 147 కోట్ల 61 లక్షల రూపాయలను ఆదా చేసుకున్నారని, జిల్లా వ్యాప్తంగా 5 వందల రూపాయలకే 3,17, 469 గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశామని వివరించారు. గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు అర్హత కలిగిన 46వేల 357 విద్యుత్ మీటర్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం జరిగిందని, మెరుగైన విద్యుత్ అందించడానికి జిల్లాకు 35 నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్లు మంజూరు కాగా 41 కోట్ల 88 లక్షల రూపాయలతో 12 సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశామని అన్నారు. గుడిసె లేని తెలంగాణ తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టి ములుగు నియోజకవర్గంలో 5 వేల 194 ఒక వెయ్యి 636 గృహాలను నిర్మించి గృహప్రవేశాలు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి ములుగు, ఏటూర్ నాగారం కేంద్రాల్లోని ప్రధాన ఆస్పత్రులలో కోట్లాది రూపాయలతో నూతన పరికరాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.నూతన పరిజ్ఞానంతో విద్య బోధన చేయడానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామని, విద్య వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల లోని మహిళలకు 9 కోట్ల 7 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని, నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా 22 కోట్ల 26 లక్షల రూపాయల నిధులను జమ చేశామని అన్నారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని శాఖల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఏటూరునాగారం లో ఐటీడీఏ ద్వారా గిరిజనులకు వివిధ సంక్షేమ ఫలాలను అందించడం జరుగుతుందని, నూతనంగా ఏర్పాటైన ములుగు మున్సిపాలిటీ 15 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని సీతక్క తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డిఎఫ్ఓ వికాస్ మీనా, అడిషనల్ ఎస్పీ సదానందం, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ములుగు మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం:మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి : 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సంగారెడ్డిలో ఘనంగా జరిగాయి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై సంగారెడ్డి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. మనం 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అమరవీరుల త్యాగఫలమే నేటి స్వతంత్ర భారతం. స్వాతంత్ర్య అంటే కేవలం జెండా ఎగరవేయడం కాదు. ప్రతి పేదవాడు, ప్రతి రైతు, ప్రతి మహిళ, ప్రతి యువకుడు తన కాళ్ళపై తాను నిలబడటమే అసలైన దామోదర రాజనర్సింహ అన్నారు. మన ప్రభుత్వం అదే లక్ష్యంతో ముందుకు సాగుతుందని. గతంలోని దోపిడీ, దౌర్జన్యాలను తరిమికొట్టి నేడు ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నాం. ఇది ప్రజల ప్రభుత్వం, ప్రజల కోసం పని చేసే ప్రభుత్వం అన్నారు.

రైతు సంక్షేమే మా ప్రథమ ప్రాధాన్యం: 418 కోట్ల రైతు భరోసా..

రైతే రాజు అని నిరూపించేందుకు మన ప్రభుత్వం కట్టుబడి ఉంది. 2025-26 సంవత్సరంలో సంగారెడ్డి జిల్లాలో 3 లక్షల 60 వేల 464 మంది రైతుల ఖాతాల్లో నేరుగా రూ. 418 కోట్లు జమ చేశాం. రైతు బీమా పథకం కింద 15 లక్షల 12 వేల 550 మంది రైతు కుటుంబాలకు 9,600 కోట్ల రూపాయల భీమా రక్షణ కల్పించాం. అదనంగా 1 లక్ష 48 వేల 205 మంది కొత్త రైతులను భరోసా పథకంలో చేర్చాం. 2025-26లో 33 వేల 540 మంది కొత్త రైతులకు 1 లక్ష 70 వేల ఎకరాలకు రూ. 405 కోట్ల 73 లక్షలు ఇచ్చాం. పంట నష్టం వచ్చినా రైతును ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట: రూ. 271 కోట్లు విడుదల

మహిళ లేని కుటుంబం లేదు, మహిళ లేని అభివృద్ధి లేదు. అందుకే మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. మహిళా సంక్షేమ పథకాల కింద జిల్లాలో ఇప్పటివరకు రూ. 271 కోట్ల 12 లక్షలు విడుదల చేశాం. రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకం కింద జిల్లాలో 1 లక్ష 76 వేల 570 మంది అక్కచెల్లెమ్మలకు రూ. 21 కోట్ల 68 లక్షల సబ్సిడీ అందించాం.



స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు 26 కోట్ల 70 లక్షల అదనపు రుణాలు ఇప్పించాం. మహిళ ఆర్థికంగా బలపడితేనే కుటుంబం, సమాజం బలపడతాయి. పేదలకు సొంత ఇల్లు కల నెరవేర్చడం మా ప్రభుత్వ ధ్యేయం. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 12,823 ఇళు మంజూరు చేసి రూ. 211 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశాం.గృహ జ్యోతి పథకం కింద 2 లక్షల 18 వేల 691 గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 204 కోట్ల 30 లక్షలతో గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేస్తున్నాం. పేదవాడికి గూడు, గుక్కెడు నీరు, కడుపునిండా అన్నం ఇవ్వడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం. అందుకే ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సంగారెడ్డిలో రూ. 275 కోట్లతో 500 పడకల ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, రూ. 168 కోట్లతో మెడికల్ కాలేజీ భవనం, రూ. 34 కోట్లతో నర్సింగ్ కాలేజీ నిర్మాణం జరుగుతున్నాయి. సదాశివపేటలో 60 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రి, 50 పడకల మాతా శిశు ఆసుపత్రి నిర్మిస్తున్నాం. జహీరాబాద్‌లో 10 కోట్ల 46 లక్షలతో 50 పడకల మాతాశిశు ఆసుపత్రి పనులు జరుగుతున్నాయి. ప్రతి మండలంలో CHC, UPHC లను అప్‌గ్రేడ్ చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

## సంక్షేమానికి పెద్దపీట.. స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి పొన్నం

సిద్దిపేట: స్వాతంత్ర్య అమృత ఘడియల్లో ప్రజాపాలన లక్ష్యాలను ప్రజల ముంగిటకు చేరుస్తూ, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి రథాన్ని పరుగులు పెట్టిస్తున్న ప్రజా ప్రభుత్వం తన ప్రగతి నివేదికను సగర్వంగా జాతికి నివేదించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకలు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నిదర్శనంగా నిలిచాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మువ్వన్నెల జెండాను ఎగురవేసి, అమరుల త్యాగాలను స్మరిస్తూ ప్రజా సంక్షేమ ప్రస్థానాన్ని చాటిచెప్పారు. అన్నదాతకు అండగా.. రైతు సంక్షేమంలో అగ్రగామి : రాష్ట్రానికి వెన్నెముకైన వ్యవసాయ రంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం రాజీలేని వైఖరిని అవలంబిస్తోందని మంత్రి స్పష్టం చేశారు.రైతుభరోసా & బీమా: జిల్లాలోని 3.25 లక్షల మంది రైతులకు ఎకరాకు రూ.6 వేల చొప్పున రూ.1,476 కోట్ల నిధులను నేరుగా ఖాతాల్లో జమ చేశారు. రైతుబీమా పథకం కింద అకాల మరణం పొందిన 3,104 రైతు కుటుంబాలకు రూ.155 కోట్ల పరిహారాన్ని యుద్ధప్రాతిపదికన అందించారు.ధాన్యం కొనుగోళ్లు: రబీ 2025-26 సీజన్‌లో 1,17,683 మంది రైతుల నుంచి 5,18,036 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో సేకరించి, రూ.1,228 కోట్లను నేరుగా చెల్లించారు. ఆరుతడి పంటల ప్రోత్సాహం: ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు తక్కువ నీటితో పూర్తయ్యే పంటల వైపు మళ్లాలని మంత్రి సూచించారు. సాగునీటి విప్లవం: ప్రాజెక్టులకు మహర్దశ : జిల్లాను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో



సాగునీటి మౌలిక వసతుల పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. మధ్య మానేరు నుంచి మల్లన్నసాగర్ వరకు అదనపు టీఎంసీ తరలింపు పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించి రూ.14,402 కోట్లతో చేపడుతున్నారు. 8.230 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 1.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే గౌరవెల్లి జలాశయం ప్రధాన కాలువల పనులు 56 శాతం పూర్తయ్యాయి. గౌరవెల్లి-గండిపల్లి ఎత్తిపోతల పథకం పనులు వేగవంతంగా సాగుతున్నాయి. మహిళా సాధికారత: 'మహాలక్ష్మి' ఆదా.. ఇందిరా మహిళా శక్తి వికాసం : స్త్రీ శక్తిని ఆర్థిక వృద్ధికి చోదకశక్తిగా మార్చేందుకు పలు చారిత్రాత్మక నిర్ణయాలు అమలవుతున్నాయి. 2023 డిసెంబర్ 15 నుంచి 2026 జూలై 31 వరకు జిల్లాలో 9.93 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి రూ.386 కోట్ల మేర ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్నారు.

## నెలాఖరులోగా మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్,రాజీవ్ లింక్ కెనాల్‌కు గోదావరి జలాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా లేక పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు.. సాగర్ ఆయకట్టుకు భరోసాగా మారిందని మంత్రి తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 15: రాజీవ్ లింక్ కెనాల్‌కు గోదావరి జలాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. (శనివారం) అశ్వాపురం మండలం సీతారామ పంప్ హౌస్ వద్ద మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. మోటార్ స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా లేక పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు.. సాగర్ ఆయకట్టుకు భరోసాగా మారిందన్నారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీళ్ల దగ్గర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

## కృష్ణా - గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదు.. సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామని, అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రభుత్వం 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని, తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నామని అన్నారు. గోల్కొండ కోటలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడకలకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరై సీఎం రేవంత్ రెడ్డి జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలని నిర్ణయించామని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రైతు సంక్షేమ కోసం అనేక పథకాలు చేపట్టామని, రైతు భరోసా, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు ఇలా.. అన్ని విషయాల్లో రైతులకు అండగా నిలుస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం రికార్డులు సృష్టించిందని అన్నారు.కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించి తీరుతామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామన్నారు. త్వరలోనే పాలమూరు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు.ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపే లక్ష్యంతో ఆగస్టు 17నుంచి రాష్ట్రంలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి సోమవారం ఈ ప్రజావాణి జరుగుతుందని, త్వరలో ఆన్‌లైన్ ప్రజావాణి పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చి రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా ప్రజలు తమ అర్జీలను నమోదు చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు.అర్జీల పరిష్కార పురోగతిని ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజలకు ఇది ఉపశమనం కలిగిస్తుందని పేర్కొంది.రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు మౌలిక వసతులు కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ పోటీ ఇతర రాష్ట్రాలతో మాత్రమే కాకుండా ప్రపంచంతోనూ ఉండేలా ప్రపంచ స్థాయి మౌలిక వసతులను నిర్మించేందుకు కార్యాచరణ ప్రారంభించినట్లు తెలిపారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 6,092 కిలోమీటర్ల హ్యామ్ రోడ్లు, రేడియల్ రోడ్ల అభివృద్ధికి చర్యలు

## సప్తధార శక్తి సామర్థ్యాలతో దేశం నూతన శిఖరాలకు..

న్యూఢిల్లీ, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఉదయం దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట వేదికగా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎర్రకోటపై 13వ సారి వరుసగా ప్రధాని మోదీ జాతీయ జెండాను ఎగుర వేశారు. ఇదిలాఉంటే.. తొలుత ప్రధాని నరేంద్ర మోదీకి రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళులర్పించారు. అనంతరం ఎర్రకోట వద్ద గౌరవవందనం స్వీకరించి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకల ప్రారంభ సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది.ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈరోజు మనమంతా 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ప్రతి హృదయంలో 'వందేమాతరం' ధ్వనిస్తోంది. ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. కొత్త తీర్మానాలతో సరికొత్త ఉత్సాహంతో దేశం ముందుకు సాగుతోందని అన్నారు.అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్ ఎదుగుతోంది. ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది. ఆత్మనిర్భర్ భారత్ సాధనే మన లక్ష్యమని, వోకల్ ఫర్ లోకల్ నినాదంతో ముందుకెళున్నామని ప్రధాని మోదీ అన్నారు. దేశంలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని, వికసిత్ భారత్ లక్ష్యంగా మరింత వేగంగా ముందుకెళ్లాలని అన్నారు. దేశానికి యువతే అతిపెద్ద శక్తి.. వికసిత్ భారత్ లో యువకుల పాత్ర ఎంతో కీలకమని ప్రధాని పేర్కొన్నారు. 12ఏళ్లలో ఎన్నో రంగాల్లో అభివృద్ధి సాధించామని, ఆత్మనిర్భర్ భారత్ ను ముందుకు తీసుకెళ్తున్నామని మోదీ పేర్కొన్నారు.కరోనా నుంచి బయటపడగానే యుద్ధాలు ముంచేశాయి. ముందు యుక్రెయిన్ యుద్ధం, ఇప్పుడు ఇరాన్ యుద్ధం. యుద్ధాలు వస్తే కొందరు ప్రజలను భయపెట్టారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన ప్రజలకు ఇబ్బందులు రానివ్వలేదు. సంక్షోభం వస్తుందని ముందే ఊహించి చర్యలు తీసుకున్నామని, దేశ అభివృద్ధిని



అడ్డుకోవటం ఎవరితరం కాదని మోదీ అన్నారు. యూరియా, డీఏపీ ధరలు పెరిగినా రైతులకు సబ్సిడీ ఇస్తున్నామని, రైతుల భారాన్ని కేంద్ర ప్రభుత్వం మోస్తుందని మోదీ పేర్కొన్నారు. భారత్ లో స్థిరమైన ప్రభుత్వం ఉందని, భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా వెళ్తోందని తెలిపారు.తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతి శక్తి, రక్షణ శక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్ అనే ఏడు ధారల సాయంతో దేశాన్ని స్వయం సమృద్ధం చేస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సప్తధార శక్తిసామర్థ్యాలతో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తామని, భారతావనికి నూతన వేగం అందిస్తామని, సరికొత్త లక్ష్యాలను సాధించి, వాటిని అధిగమించేలా శక్తివంతం చేస్తామని అన్నారు. యువతలో ఉన్న అపార సామర్థ్యాలను దేశ నిర్మాణం కోసం పూర్తిగా వినియోగిస్తామని మోదీ పేర్కొన్నారు. గత ఐదు నుంచి ఏడు దశాబ్దాల్లో సాధించలేని దానిని ఈ ఏడు ధారల సాయంతో వచ్చే ఐదు నుంచి ఏడు సంవత్సరాల్లో సాధిస్తామని, దేశాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తామని ప్రధాని మోదీ వెల్లడించారు.



## సంపాదకీయం

ఆదివారం 16-08-2026

# బస్సు నేర్పిన పాఠం..

జీవితం సాఫీగా సాగుతున్నప్పుడు మన వెంట చాలామంది ఉంటారు. కానీ కష్టాల్లో బస్సు ఆగిపోయినప్పుడు ఎవరు మనకు అండగా నిలుస్తారో చెప్పే భావోద్వేగ జీవిత పాఠం.

బస్సు నేర్పిన పాఠం..

ఆ రోజు ఉదయాన్నే ఫోన్ వచ్చింది. "భయ్యా.. రాంనగర్‌లో ఉన్నా, వచ్చేయ్" అన్నాడు నా దోస్తు. "సరే" అని చెప్పి మొహం మీద కాస్త నీళ్లు చల్లుకుని రెడీ అయ్యి బయలుదేరాను.. నెమ్మదిగా నడుచుకుంటూ పక్కనే ఉన్న బస్టాండ్‌కి చేరుకున్నా. ఓ పది నిమిషాలు వెయిట్ చేసిన తర్వాత కోఠి నుంచి రాంనగర్ వెళ్లే బస్సు వచ్చింది. వెంటనే బస్సు ఎక్కేశా. అప్పటికే బస్సులో ప్రయాణికులు బాగానే ఉన్నారు. కాసేపటి తర్వాత కండక్టర్‌ని అడిగితే.. "ఈ బస్సు డైరెక్ట్‌గా రాంనగర్ వెళ్లదు. విద్యానగర్ మీదుగా తిరిగి వెళ్తుంది" అన్నారు. "సరేలే.. ఓ పది నిమిషాలు ఆలస్యం అంతేగా!" అనుకుని ఫోన్ చూస్తూ కూర్చున్నా.

బస్ ఆగిపోవడంతో..

అలా కొద్దిసేపటికి విద్యానగర్ వచ్చేసింది. ఇంకో ఐదు నిమిషాల్లో రాంనగర్ వస్తుంది అనుకుంటుండగానే.. ఒక్కసారిగా బస్సు రోడ్డుపైనే ఆగిపోయింది. డ్రైవర్ బస్సును స్టార్ట్ చేయడానికి చాలాసేపు ప్రయత్నించారు. కానీ బస్సు స్టార్ట్ కాలేదు. చివరికి డ్రైవర్ ప్రయాణికుల వైపు తిరిగి చూస్తూ.. "ఎంత ప్రయత్నించినా బస్సు స్టార్ట్ అవ్వడం లేదు. అందరూ కిందికి దిగి కొంచెం నెట్టండి.. నేను స్టార్ట్ చేస్తా" అని అడిగారు. అంతే.. బస్సులో ఉన్నవాళ్లంతా ఒక్కసారిగా కిందికి దిగిపోయారు. నేనూ దిగాను. బస్సు వెనక్కి వెళ్లి చూస్తే అక్కడ ఒక్క ప్రయాణికుడు కూడా కనిపించలేదు.. అందరూ పక్కనే ఉన్న చిన్న బస్టాండ్‌లోకి వెళ్లి నిల్చున్నారు. "అరే.. బస్సు నెట్టమంటే వీళ్లంతా అక్కడికి ఎందుకు వెళ్లారు?" అనుకుంటూ అక్కడే నిల్చున్నా. నేను ఒక్కడిని నెట్టినంత మాత్రాన బస్సు కదలదు కదా! కండక్టర్ మాత్రం నాతో కలిసి బస్సును నెట్టడానికి ప్రయత్నించారు. కానీ బస్సు కదల్లేదు.

జీవితం బస్ లాంటిదే..

ఇంతలో వెనకాల మరో బస్సు వచ్చింది. అంతే.. ఇప్పటివరకు ఈ బస్సులో ప్రయాణించిన వాళ్లంతా ఆ బస్సు ఎక్కి వెళ్లిపోయారు. నేను మాత్రం అక్కడే ఉండిపోయా. డ్రైవర్ బస్సును ఎలాగైనా స్టార్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారు.. కండక్టర్ మాత్రం రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కాకుండా చూస్తున్నారు. నేను కొద్దిసేపు వాళ్లిద్దరినీ గమనిస్తూ అక్కడే నిల్చున్నా. అప్పుడే నా మనసు ఒక్క సారిగా గతంలోకి వెళ్లింది.. "జీవితం కూడా ఈ బస్సు లాంటిదే కదా!" అనిపించింది. మనం సాఫీగా నడుస్తున్నంతకాలం అందరూ మనతో పాటు ప్రయాణిస్తారు. మన సంతోషంలో నవ్వుతారు. మన విజయాన్ని చూసి అభినందిస్తారు. మనతో కలిసి నడుస్తారు. మనపై ప్రేమ చూపిస్తారు. కానీ.. మన 'జీవితం' అనే బస్సు ఎక్కడైనా ఆగిపోతే? మనకొక సమస్య వస్తే? పరిస్థితులు తిరగబడితే? అప్పుడు మనతో ఉన్నవాళ్లంతా ఒక్కొక్కరుగా పక్కకు తప్పుకుంటారు. మన జీవితం ముందుకు కదలడానికి మనకు ధైర్యం చెప్పేందుకు, సాయం చేయడానికి ఎవరూ ముందుకు రారు.. ఒకరిద్దరు తప్ప. 'కొంచెం సాయం చేస్తే అందరం కలిసి ముందుకు వెళ్లొచ్చు కదా' అనే ఆలోచన కూడా ఎవరికీ రాదు. వెంటనే వెనకాల ఇంకో బస్సు వస్తే ఎక్కి వెళ్లిపోయినట్లు.. వాళ్లకు అనుకూలమైన మరో దారి చూసుకుంటారు.

నాకు కష్టం వస్తే..

ఆ క్షణం నా జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు ఒక్కసారిగా గుర్తొచ్చాయి. నేను సం తోషంగా ఉన్నప్పుడు నా చుట్టూ ఉన్నవాళ్లలో చాలా మంది.. నేను ఇబ్బందుల్లో ఉ న్నప్పుడు కనిపించకుండా పోయారు. నేను వాళ్ల కోసం నిలబడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ నాకు కష్టం వచ్చినప్పుడు వాళ్లు కనీసం ఒక్క సారి "ఎలా ఉన్నావు?" అని కూడా అడగలేదు. వాళ్లు మనతో ఉండేది కేవలం మన ప్రయాణం సౌకర్యంగా ఉన్నంతవరకే! వాళ్ల అవసరం తీరిపోయాక, కనీసం ఒక పలకరింపుకు కూడా సమయం కేటాయించరు. రోడ్డుపై ఆగిపోయిన ఆ బస్సు నాకు ఒక గొప్ప పాఠం నేర్పింది. మన జీవితం అనే బస్సు సాఫీగా నడుస్తున్నప్పుడు పక్కన ఎంతమంది ఉన్నారనేది ముఖ్యం కాదు.. అది ఆగిపోయినప్పుడు దాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఎంతమంది మన పక్కన నిలబడి సహాయం చేశారనేదే ముఖ్యం! అలా జీవితంలో నాకు పాఠం, గుణపాఠం నేర్పిన వాళ్లు ఆ బస్సు వల్ల ఆ రోజు మళ్లీ గుర్తొచ్చారు..

# హైదరాబాద్ గ్రాడ్యుయేట్ స్థానంలో బీఆర్ఎస్ సరికొత్త వ్యూహం !




హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పోరుకు వేదిక సిద్ధమవుతోంది. రాజధాని హైదరాబాద్ పట్టభద్రుల శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధిష్టానం ఈ స్థానంపై తీవ్ర దృష్టి సారించింది. దశాబ్ద కాలంగా గ్రేటర్ పరిధిలో ప్రజాప్రతినిధుల పరంగానూ, సంస్థాగతంగానూ పట్టు నిలుపుకుంటూ వస్తున్న బీఆర్ఎస్.. మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఈ స్థానాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ చేజార్చుకోకూడదని వ్యూహాలు రచిస్తోంది. రాబోయే ఎన్నికల్లో విజయావకాశాలే ఏకైక ప్రామాణికంగా గులాబీ బాస్ సరికొత్త ముఖాల వేటలో పడినట్లు సమాచారం. యువతతో నిత్యం ఉండేవారికే అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిసింది.

ముగియనున్న పదవికాలం..

తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఒకటి ఖమ్మం, వరంగల్, నల్గొండ, రెండోది హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు వచ్చే ఏడాది మార్చి లో పదవీ కాలం ముగియనుంది. ఇక రెండు స్థానాలు గతంలో బీఆర్ఎస్ పార్టీకి సిట్టింగ్ స్థానాలుగా ఉన్నాయి. అయితే ఖమ్మం, వరంగల్, నల్గొండ స్థానంకు జరిగిన జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. సిట్టింగ్ స్థానంను చేజార్చుకుంది. అయితే 2027 మార్చిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. అయితే ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి పట్ట భద్రుల ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. హైదరాబాద్ సిట్టింగ్ స్థానంను తిరిగి దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది.

రేసు నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ అవుట్?

హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ గా వాణిదేవి పనిచేస్తున్నారు. అయితే ఆమె పోటీకి దూరంగా ఉంటారనే ప్రచారం జరుగుతుంది. పార్టీ సైతం కొత్తవారికి ఇవ్వాలని యోచిస్తున్నట్లు సమాచారం. కానీ వాణిదేవి మాత్రం పార్టీఅధిష్టానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, మళ్లీ అవకాశం కల్పిస్తే పోటీ చేస్తానని అభిప్రాయపడుతున్నారు. ఒక వేళ తనకు ఇవ్వకున్నా తనకుమార్తెకు టికెట్ ఇవ్వాలని పార్టీకి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. అయితే పార్టీ మాత్రం కొత్త అభ్యర్థికోసం కసరత్తు స్టార్ట్ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. హైదరాబాద్,రంగారెడ్డి,మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం కీలకం కావడంతో పార్టీ ప్రత్యేక దృష్టిసారించింది.

ఇప్పటికే పలువురి పేర్ల పరిశీలన

సిట్టింగ్ ఎమ్మెల్సీ మార్పు దాదాపు ఖాయమనే ప్రచారం జరుగుతుంది. ప్రత్యామ్నాయంగా సమర్థుడైన నేతను ఎంపిక చేసేందుకు అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగినట్లు సమాచారం. హైదరాబాద్ నగర సామాజిక వర్గాలు, ఆర్థిక బలం, పార్టీ పట్ల అంకితభావం ఉన్న వారిపై ఆరా తీస్తున్నారు. గ్రేటర్ పై బీఆర్ఎస్ కు బలమైన పట్టుంది. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఎక్కువ మంది ఎమ్మెల్యేలను సైతం గెలుచుకుంది. ఒక మహబూబ్ నగర్ జిల్లాల్లో మాత్రమే కొంత వెనుకబడింది. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తమకు కలిసి వస్తుందని కాంగ్రెస్ నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం, ఉద్యోగ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అంశాలను అమలు చేయకపోవడంతో గులాబీకి ప్లస్ అవుతుందని ఆశాభావంతో ఉంది. దీంతో పలువురి పేర్లను పరిశీలిస్తుంది.

కార్పొరేషన్ చైర్మన్లు..

నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఐ.ఆర్.ఎస్ అధికారి ఉదయ్ కాంత్ కు టికెట్ ఇస్తారనే ప్రచారం జరుగుతుంది. బీసీసామాజిక వర్గానికి చెందిన అధికారి వీఆర్ఎస్ తీసుకుని ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెడీగా ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఆయనతో పాటుసాట్స్ కార్పొరేషన్ చైర్మన్లుగా పనిచేసిన ఈడిగ ఆంజనేయులు గౌడ్, అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి ల పేర్లను సైతం పార్టీ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆంజనేయులు గౌడ్ ఉస్మానియా విద్యార్థి కావడం, ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడంతో పాటు పోల్ మేనేజ్ మెంట్ చేయడంలోనూ అవగాహన ఉంది. పలు ఎన్నికలకు నియోజకవర్గాలకు ఇన్ చార్జ్‌గా పనిచేసిన అనుభవం సైతం ఉంది.

ఉపాధ్యాయులతో సమావేశం..

బీసీ వర్గానికి చెందిన నరేందర్ గౌడ్ సైతం ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. గత ఎన్నికల సమయంలోనూ హైదరాబాద్ టికెట్ ఆశించారు. అందుకోసం కసరత్తు సైతం చేశారు. అయితే చివరి నిమిషంలో పార్టీ అధిష్టానం పీవీ నర్సింహరావు కుమార్తె వాణిదేవికి టికెట్ ఇచ్చింది. అయితే మళ్లీ ఈ టికెట్ ను ఆశిస్తున్నారు. అందుకోసం ప్రయత్నాలు సైతం షురూ చేసినట్లు సమాచారం. సెప్టెంబర్ లో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఉ మ్మడిరంగారెడ్డి జిల్లా పట్టభద్రుల, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. నరేందర్ గౌడ్ ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సెక్రటరీగా పనిచేస్తున్నారు. విద్యార్థి, ఉద్యమ నాయకుడిగా గుర్తింపు ఉంది. స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రస్ట్రక్షర్ కార్పొరేషన్ చైర్మన్ గా పనిచేశారు. ఈసారి పార్టీ అధిష్టానం ఆశీస్సులు పొందాలని గట్టిపట్టుదలతో ఉన్నారు. వీరితో పాటు మరికొంతమంది నేతల పేర్లను సైతం పార్టీ అధినేత కేసీఆర్ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## ధర్నా చౌక్ దగ్గర అయూష్ వైద్య విద్యార్థుల ధర్నా

హైదరాబాద్,రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పదేండ్ల కాలం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల ప్రజా పరిపాలనకు దగ్గర వస్తున్నా కూడా తెలంగాణ ఆయుష్ హౌస్, జూణ వైద్యులు, హోమియోపతి, అల్లోపతి వైద్యులకు స్టైఫండ్ లను ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం ఎందుకు చేస్తుందని తెలుగుదేశం అధికార ప్రతినిధి జోత్స్న ప్రశ్నించారు. హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద ఆయుష్ వైద్యులు మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి పలు పార్టీ నాయకులు విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం అధికార ప్రతినిధి జ్యోత్స్న మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో ఉండి ప్రజలకు వైద్యం అందిస్తున్న ఆయుష్ వైద్యులకు స్టీఫండ్ పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదని ధ్వజమెత్తారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నుండి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్లు విద్యార్థులపై చిన్న చూడటం సరికాదన్నారు.

# మానవ వన్యప్రాణి సంఘర్షణ లేకుండా జీవనం అత్యున్నతమైనది

అమరావతి,ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపులతో తీవ్రమైన సమస్యలుండేవి. సుమారు 132 నుంచి 142 ఏనుగులు గుంపులుగా ఏజెన్సీ ప్రాంతంలో కల్లోలం సృష్టించేవి. చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల గుంపులు పంటపొలాల మీద పడి పంటలను ధ్వంసం చేయడం, అడ్డొచ్చే వారిపై దాడులు చేయడంతో ప్రజల్లో భయందోళనలు నెలకొన్నాయి. నేను అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల బాధ్యతలను తీసుకున్న తర్వాత మొదటిగా ప్రజలకు, ఏనుగులతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం మీదనే దృష్టి సారించాన'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మదపుటేనుగులను నిరోధించేందుకు నాలుగు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వ సహాయంతో తీసుకొచ్చి, వాటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మానవులు ? వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను నివారించే ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వీటివల్ల ఏజెన్సీ ఏరియాల్లో మంచి ఫలితాలొస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్ లో కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "ఏనుగులు పర్యావరణ సమతుల్యతకు వారధిగా నిలుస్తాయి. దేశ వన్యప్రాణి వారసత్వానికి అవి చిహ్నాలు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏనుగుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2014 నుంచి దేశంలోని ఏనుగుల సంరక్షణ కేంద్రాలు 26 నుంచి 33కు పెరిగాయి. కారిడార్ల రక్షణ, 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' బలోపేతం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 150 ఏనుగుల కారిడార్లను దేశవ్యాప్తంగా గుర్తించడం ద్వారా ఏనుగుల ఆవాసాలకు ఇబ్బంది లేకుండా ఉంది. ఈ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అనుసరిస్తోంది. ఏనుగుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కుంకీ ఏనుగులను రాష్ట్రానికి అందించడంలో సహకరించిన కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శ్రీ సిద్ధరామయ్య గారికి, ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కి, అప్పటి అటవీ, పర్యావరణ శాఖమంత్రి ఈశ్వర్ ఖండ్రే కి ఈ సందర్భంగా మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది కేవలం రెండు రాష్ట్రాల మధ్య సహకారం మాత్రమే కాదు. ఇది ప్రజలు, ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ కోసం సాగుతున్న పరస్పర సహకారం. కుంకీ ఏనుగులు ఇప్పటికే మదపుటేనుగులు చేసే విధ్వంసాలను అరికట్టే 15 కార్యకలాపాలలో సహాయపడ్డాయి. దీనివల్ల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మానవ మరణాలు 70 శాతం తగ్గింది. పంట నష్టం కూడా తగ్గింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున కూడా సొంత కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాం. ఇప్పటికే ఒక శిక్షణ పొందిన కుంకీ ఏనుగు జయంత్ పార్వతీపురం మన్యం ప్రాంతంలో ఉంది. ప్రతి ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వాలనేది మా ప్రణాళిక. హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలుమానవులు ? వన్య ప్రాణుల మధ్య నెలకొన్ని ఘర్షణలను పూర్తిగా నిరోధించేందుకు, వన్య ప్రాణులను రక్షణ కోసం రూపొందిన హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు వస్తున్నాయి. వేగవంతమైన స్పందన, సాంకేతికత, వణ్య ప్రాణులతో కలిగే నష్ట నివారణ కోసం సమగ్ర మానవ-వన్యప్రాణుల సంఘర్షణ నిర్వహణ వ్యవస్థ అయిన ఊ.ం.ఔ.ఒ.ఓ.ం.ఔ (హనుమాన్) ప్రాజెక్టును 2026, మార్చిలో ప్రారంభించాం. 93 స్పందన వాహనాలు, 7 వన్యప్రాణి



అంబులెన్స్‌లను ఈ ప్రాజెక్టులో సిద్ధం చేశాం. ఇప్పటి వరకు 200కు పైగా వన్యప్రాణులు రక్షించడమే కాకుండా, 30కి పైగా వన్యప్రాణులను తరలింపు కార్యక్రమం జరిగింది. సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. సమాజాన్ని దీనిలో భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ప్రతి రైతు భయం లేకుండా సాగు చేయగలిగే పరిస్థితికి చేరుకోవాలన్నదే లక్ష్యం. వణ్య ప్రాణులను, ప్రజలను విడదీయడం మా ఉద్దేశం కాదు... ప్రజలు, వన్యప్రాణులు ఒకే ప్రదేశంలో సురక్షితంగా కలిసి జీవించగలిగే భవిష్యత్తును సృష్టించడమే అసలైన విజయం" అని అన్నారు.ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్ పుస్తకావిష్కం ఇఅంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా అటవీ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన "ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్" పుస్తకాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తివర్ధన్ సింగ్ గారితో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలో ఏనుగుల సంరక్షణకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ తోపాటు వైల్డ్ లైఫ్ సైన్స్ కి సంబంధించిన పలు పుస్తకాలను విడుదల చేశారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కలంకారీ కళాకారులు రూపొందించిన ప్రత్యేక కళాఖండాన్ని కూడా ఆవిష్కరించారు. అనంతరం దేశవ్యాప్తంగా 21,450 పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో 20 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏనుగుల సంరక్షణ చర్యల్లో ప్రాణాలు కోల్పోయిన ఒడిశాకి చెందిన క్షేత్ర స్థాయి అటవీ శాఖ అధికారి జుగల్ నాయక్ కు గజ గౌరవ్ అవార్డును అందజేశారు. కుటుంబాలను సత్కరించి, ఏనుగుల పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంలో విశేష కృషి చేసిన, రక్షణ చర్యల్లో పాల్గొన్న సిబ్బందికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ , పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్ , అటవీ శాఖ డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి సుశీల్ కుమార్ అవస్థి , రాష్ట్ర అటవీ మరియు పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే , పీసీసీఎఫ్ డాక్టర్ పి.వి. చలపతిరావు, ప్రాజెక్ట్ ఎలిఫెంట్ స్టీరింగ్ కమిటీ సభ్యులు, భారత ప్రభుత్వ, రాష్ట్ర అటవీ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్

మహబూబ్ నగర్,మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి పరిధిలో 416.18 ఎకరాల భూమిని గుర్తించి సర్వేలు నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చర్చల తర్వాత ఈ ప్రాజెక్టుపై ముందడుగు పడింది. ఈ యూనిట్ ద్వారా స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.మహబూబ్‌నగర్ జిల్లాలో రక్షణ రంగానికి సంబంధించిన ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ఈ యూనిట్ కోసం 416.18 ఎకరాల భూమిని అధికారులు గుర్తించి, క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల సర్వే విజయవంతంగా పూర్తికాగా.. ప్రస్తుతం పట్టా భూముల పరిశీలన కొనసాగుతోంది. రాష్ట్రంలో రక్షణ రంగ తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా ఇది అత్యంత కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు.గత ఏడాది జూలైలో డీఆర్‌డీవో అధికారులు మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి భౌగోళిక పరిస్థితులను పరిశీలించారు. రవాణా సదుపాయాలు, రోడ్డు, రైలు మార్గాలు అనుకూలంగా ఉండటంతో పాలమూరు ప్రాంతం బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు సరిగ్గా సరిపోతుందని భావించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమై ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించడంతో రాష్ట్ర యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి భూసేకరణ ప్రక్రియను ముమ్మరం చేసింది.దేవరకద్ర మండలంలోని జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి గ్రామాల్లో 416.18 ఎకరాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. చౌదర్‌పల్లిలో సర్వే నంబర్లు 295, 296 సహా బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల్లో పట్టా భూముల వివరాలను సేకరించారు. సర్వేకు ముందే గ్రామ పంచాయతీల ద్వారా రైతులకు సమాచారం అందించి వారి సమ్మతితోనే పరిశీలనలు జరుపుతున్నారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రైతులకు ఆమోదయోగ్యమైన నష్టపరిహారాన్ని నిర్ణయించనున్నారు.పాలమూరులో బ్రహ్మోస్ తయారీ కేంద్రం ఏర్పాటైతే ఈ ప్రాంత ఆర్థిక రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రధాన యూనిట్‌తో పాటు అనుబంధ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, లాజిస్టిక్స్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, నాణ్యతా ప్రమాదాల విభాగాల్లో సాంకేతిక నిపుణులతో పాటు అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల్లో స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

# పాపం గోరంట్ల...

అనంతపురం,పోలీస్ ఖాకీ డ్రెస్ వదిలి, ఎంపీ గిరీ అనుభవించి ఒక వెలుగు వెలిగిన హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రాజకీయ జీవితం ప్రస్తుతం అత్యంత దిగువ స్థాయికి పడిపోయింది. 2019లో వైఎస్సార్సీపీ తరఫున పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆయన, పదవీకాలంలో వివాదాలతో వార్తల్లో నిలిచారు. 2024 ఎన్నికల్లో ఆయనకు టికెట్ నిరాకరించిన పార్టీ అధిష్ఠానం, ఆ తర్వాత ఏదో పేరుకే అన్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి పదవి కట్టబెట్టింది. అయితే, పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా.. పార్టీ తాడేపల్లి ఆఫీసు ఆవరణలో కూడా ఆయనకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదన్నది ఓపెన్ సీక్రెట్.ఉమ్మడి అనంతపురం జిల్లాలో గోరంట్ల మాధవ్‌కు అసలు ఒక్క నియోజకవర్గ బాధ్యత కూడా లేదు. పార్టీ హైకమాండ్ ఆయనకు జిల్లాలో ఏ అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఇన్‌చార్జ్ పదవినీ అప్పగించలేదు. అధికార ప్రతినిధిగా కనీసం తాడేపల్లిలో ప్రెస్ మీట్లు పెట్టి పార్టీ వాయిస్ వినిపించే అవకాశం కూడా సక్రమంగా దక్కడం లేదనే చర్చ నడుస్తోంది. దీంతో తాను ఇంకా రాజకీయాల్లో ఉనికిలోనే ఉన్నానని ప్రపంచానికి చెప్పుకోవడానికి మాజీ ఎంపీ పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో ఎక్కడో ఒకచోట ధర్నా జరుగుతోందంటే చాలు.. పిలవకపోయినా వెళ్లి ప్రత్యక్షమైపోవడం ఆయనకు అలవాటుగా మారిందనే విమర్శలు ఉన్నాయి.ఇటీవల రాప్తాడు నుంచి మొదలుకుని ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి తలపెట్టిన నిరసనల వరకు, పార్టీ ఎక్కడ రోడ్డెక్కినా మాజీ ఎంపీ హడావుడిగానే చేరుకుంటున్నారు. ధర్నాల దగ్గర పోలీసులు అడ్డుకుంటే వారితో వాగ్వాదానికి దిగడం, బలవంతపు అరెస్టులు కావడం, ఆ క్రమంలో కొత్త కొత్త కేసులు మూటగట్టుకోవడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ రకమైన ఓవర్ ఆక్షన్ చేస్తున్నారని, ఈ హడావుడి వల్ల ఎలాంటి రాజకీయ లబ్ధి కలగపోగా పోలీసు కేసులు, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది.గతంలో గౌరవప్రదమైన సీఐ ఉద్యోగాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చిన గోరంట్ల మాధవ్, ఇప్పుడు ఇటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోస్టు లేక, అటు పార్టీ అధినేత జగన్ ఆశీస్సులు దక్కక తీవ్ర రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ఆవేశంగా మాట్లాడటం, ప్రతిదానికీ హైడ్రామా సృష్టించడం తప్పితే సొంతంగా కేడర్‌ను లేదా నియోజకవర్గంలో పట్టును పెంపొందించుకోవడంలో ఆయన విఫలమయ్యారనేది సొంత పార్టీ నేతల భావన. రేపోమాపోఆయన తనను పార్టీ హైకమాండ్ వాడుకుని వదిలేసిందని.. బోరుగడ్డలాగా ధర్నా చేసినా ఆశ్చర్యం లేదన్న భావన వినిపిస్తోంది.

# సెలబ్రెటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

న్యూఢిల్లీ,కొన్ని సంస్థలు, కంపెనీలు ప్రచారం చేసుకునేందుకు సోషల్ మీడియాను ఎందచుకుంటున్నాయి. ఇందులోని ఇన్ ఫ్లుయెన్సర్స్ సైతం ఆదాయం పెంచుకునేందుకు కొన్ని ప్రత్యేక ప్రొడక్ట్స్ ను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. చాలా మంది ఇలా వాటి గురించి తెలుసుకొని వస్తువులు, ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసేవారిని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఉత్పత్తుల గురించి పూర్తిగా తెలుసుకోకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. దీని గురించి పూర్తి వివరాల్లోకి వెళితె..కొందరు సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆహార పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే ఉత్పత్తుల గురించి ధ్రువీకరించని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆహారపదార్థాల్లోని 'ఇమ్యూనిటీ' 'పోషకాలు అధికంగా ఉన్నాయి' వంటి వాటి గురించి నిజానిజాలను పరిశీలించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది.ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేస్తున్నప్పుడు దాని ప్యాకేజింగ్‌పై ఉన్న వివరాలు, పోషక విలువలు, తయారీదారు చేస్తున్న ఆరోగ్య క్లెయిమ్స్ వంటి అంశాలను ఇన్‌ఫ్లుయెన్సర్లు పరిశీలించాలి. కేవలం బ్రాండ్ చెప్పిందని లేదా డబ్బులు తీసుకుని నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు చెప్పకూడదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఫుడ్‌కు సంబంధించిన క్లెయిమ్స్ నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవి, వినియోగదారులను తప్పుదోవ పట్టించనివిగా ఉండాలి.ఒక ఆహార పదార్థం లేదా దానిలోని ఏదైనా పదార్థం ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని

# తెలంగాణలోనూ మఖానా సాగు

హైదరాబాద్,వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం కోసం తెలంగాణ, బీహార్ రాష్ట్రాలు ముందుకు వచ్చాయి. తెలంగాణలో విజయవంతమైన ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని అధ్యయనం చేయడానికి బీహార్ ఆసక్తి చూపగా.. బీహార్‌లో ప్రసిద్ధి చెందిన మఖానా సాగు, ప్రాసెసింగ్ విధానాలపై తెలంగాణ ఆసక్తి వ్యక్తం చేసింది. సెక్రటేరియట్‌లో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీహార్ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా భేటీ అయి.. ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, పంటల వైవిధ్యీకరణపై చర్చించారు. ఈ రెండు రాష్ట్రాల వ్యవసాయ శాఖల మధ్య చోటుచేసుకుంటున్న ఈ పరిణామం నూతన వ్యవసాయ సహకారానికి మార్గం సుగమం చేస్తోంది. ఈ మేరకు బీహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. ఈ భేటీలో వ్యవసాయంలో అత్యాధునిక సాంకేతిక వినియోగం, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, కొత్త పంటల సాగు, ప్రాసెసింగ్ పరిశ్రమలు, మార్కెటింగ్ విధానాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, నర్సరీల అభివృద్ధి, పామాయిల్ ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుపై బీహార్ మంత్రి ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో 2025?26లో సుమారు 3.1 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరిగి 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్ ఉత్పత్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నమూనాను పరిశీలించేందుకు బీహార్ నుంచి ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని పంపనున్నారు. మరోవైపు బీహార్‌లో విస్తృతంగా సాగయ్యే మఖానా పంటపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. మఖానా ఉత్పత్తిగా కాకుండా ప్రాసెసింగ్, బ్రాండింగ్, విలువ జోడింపుతో మార్కెట్ చేయడంపై బీహార్ అనుభవాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ భావిస్తోంది. బీహార్‌లో పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాల కోసం ప్రత్యేక పంట క్లస్టర్లను అభివృద్ధి చేసిన విధానాన్ని ఆ రాష్ట్ర అధికారులు వివరించారు. ఈ పరస్పర సహకారం వల్ల రెండు రాష్ట్రాల రైతులకు కొత్త పంటలు, సాంకేతికతలు, ప్రాసెసింగ్ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణకు మఖానా వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు మార్గం సుగమం కాగా.. బీహార్‌కు ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటను విస్తరించే అవకాశం లభిస్తుంది. ఇరు రాష్ట్రాల శాస్త్రవేత్తలు, రైతుల బృందాల పర్యటనల ద్వారా ఉత్తమ పద్ధతుల మార్పిడి మరింత వేగవంతం కానుంది.

## 80 ఏళ్ల భారతావని...ఎన్నో మార్పులు... అయినా..

న్యూఢిల్లీ, భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో, ప్రజల ఆర్థిక అలవాట్లలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ప్రాథమిక అవసరాలకే పరిమితమైన కుటుంబాలు, ఇవాళ ప్రీమియం ఉత్పత్తులు, విదేశీ ప్రయాణాలు, వినోదంపై ఖర్చు చేస్తున్నాయి. స్థిరత్వం కోసం బ్యాంకు డిపాజిట్లపై ఆధారపడే స్థాయి నుండి, సంపద సృష్టి కోసం ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టే స్థాయికి భారతీయ మధ్యతరగతి వర్గం అద్భుతంగా ఎదిగింది.భారత్ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందినప్పుడు, పేదరికం, నిరక్షరాస్యత, ఆహార అభద్రత ఎక్కువగా ఉండేవి. ఆ కాలంలో సగటు కుటుంబాల ఇంటి వినియోగం కేవలం నిత్యావసరాలకు మాత్రమే పరిమితమై ఉండేదని ఆర్థికవేత్తల అంచనాలు చెబుతున్నాయి. కానీ 79 ఏళ్ల ఈ చారిత్రక ప్రయాణంలో భారతీయ ఆర్థిక వ్యవస్థ ఎంతో వృద్ధి చెందింది. ఒకప్పుడు స్కూటర్ కొనాలని ఆశపడిన కుటుంబం, ఇప్పుడు ఆధునిక ఎలక్ట్రిక్ కార్ల కోసం చూస్తోంది. ఇప్పుడు ప్రజల ఆర్థిక ఆకాంక్షలు స్థిరత్వాన్ని పొందడం నుండి, పెట్టుబడుల ద్వారా చురుకుగా సంపదను సృష్టించడం వైపు గణనీయంగా మారాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

కొరత నుండి ఎంపిక వరకు...

ఒకప్పుడు సగటు భారతీయుడి ఆర్థిక ఆకాంక్షలు కేవలం కూడు, గుడ్డ, ఇల్లు సంపాదించడంపైనే కేంద్రీకృతమై ఉండేవి. ఇవాళ పెరుగుతున్న ఆదాయాలు, వేగవంతమైన పట్టణీకరణ, డిజిటల్ వేదికల కారణంగా కుటుంబాలకు అనేక రకాల ఆప్షన్లు అందుబాటులోకి వచ్చాయి. తాజా సర్వే గణాంకాల ప్రకారం, గ్రామీణ, పట్టణ కుటుంబాల ఖర్చుల మధ్య అంతరం కూడా వేగంగా తగ్గుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కేవలం కడుపు నిండా తినడానికి చేసే ఖర్చుల వాటా క్రమంగా తగ్గి, మిగిలిన డబ్బును రవాణా, వినోదం, గృహవసతి, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, ఎలక్ట్రానిక్స్ వస్తువుల కోసం ఉపయోగిస్తున్నారు.

సామూహిక వినియోగం నుండి ప్రీమియం వరకు...

ఆటోమొబైల్ రంగంలో సైతం వినియోగదారుల ఆలోచనా విధానంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వినియోగదారులు కేవలం అత్యంత చౌకైన ఎంట్రీ-లెవల్ వాహనాల కోసం చూడకుండా, వాడిన కార్ల మార్కెట్‌లో కూడా ప్రీమియం వేరియంట్లు , మెరుగైన సౌకర్యాలున్న ఎస్‌యూవీలను కొనుగోలు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్ల విషయంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. ఉదాహరణకు, రూ.30 వేలుపైబడిన ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ల మార్కెట్ వాటా 2020లో 20% ఉండగా, 2025 నాటికి అది 26%కి గణనీయంగా పెరిగింది.

పెరుగుతున్న ప్రయాణాలు, వినోద ఖర్చులు

ఒకప్పుడు కేవలం కొద్దిమందికి మాత్రమే పరిమితమై, విలాసంగా భావించిన అంతర్జాతీయ విదేశీ ప్రయాణాలు.. ఇప్పుడు మధ్యతరగతి ప్రజలకు సాధారణ ఖర్చుగా మారిపోయాయి. పర్యాటక శాఖ లెక్కల ప్రకారం 2025లో భారత పౌరులు రికార్డు స్థాయిలో 32.83 మిలియన్ల విదేశీ పర్యటనలు చేశారు. మరోవైపు సంగీత కచేరీలు, క్రీడా కార్యక్రమాలు, లైవ్-ఈవెంట్స్ కోసం కూడా ప్రజలు ఇప్పుడు చాలా ఎక్కువ డబ్బును వెచ్చిస్తున్నారు.


పొదుపు నుండి పెట్టుబడుల వైపు...

దశాబ్దాలుగా సంప్రదాయ భారతీయ కుటుంబాలు బ్యాంకు డిపాజిట్లు, స్థిరాస్తులు , బంగారంపై మాత్రమే ఎక్కువగా ఆధారపడేవి. కానీ ఇప్పుడు గృహ ఆర్థిక ఆస్తులలో ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్ల వాటా భారీగా పెరుగుతోంది. నెలవారీ సిప్ కంట్రిబ్యూషన్‌లు ఈజ17లో రూ.4,000 కోట్ల కంటే తక్కువగా ఉండగా, ఈజ26 ఏప్రిల్-నవంబర్ నాటికి ఏకంగా రూ.28,000 కోట్లకు పైగా అద్భుతంగా వృద్ధి చెందాయి. పెట్టుబడిదారుల సంఖ్య కూడా 2020లో 3.1 కోట్లు ఉండగా, 2025 నాటికి 11 కోట్లకు పైగా విస్తరించింది.భవిష్యత్తులో భారతీయ వినియోగ కథ కేవలం ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి పెద్ద మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, టైర్-ఎఎ , టైర్-ఎఎఎ నగరాలకు కూడా వేగంగా విస్తరించనుంది.

## భగత్ సింగ్ నగర్ లో అర్ధరాత్రి పోలీసుల కార్డెన్ సర్చ్

సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో అర్ధరాత్రి పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. సిపి ఆదేశాలతో ఎల్బీనగర్ డిసిపి ఆధ్వర్యంలో ఈ గార్డెన్ సర్చ్ జరిగింది. ఇందులో 33 అనుమతులు లేని చక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అంతేకాదు చలాన్లు ఉన్న వెహికల్ లను గుర్తించి వారి నుండి చలాన్లు వసూలు చేసినట్టు డీసిపి తెలియజేశారు. అంతేకాకుండా అనుమానితులను అలాగే రౌ డి షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు డిసిపి తెలియజేశారు. అక్రమంగా నిల్వ ఉన్న మద్యం బాటిలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. గుట్కా ప్యాకెట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు..

# పెద్దిరెడ్డి మళ్లీ యాక్టివ్...



తిరుపతి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి యాక్టివ్ అయ్యారు. తాజాగా ఆయన అనంతపురం జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ-2025 వ్యతిరేక నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్లారు. అయితే.. పోలీసులు ఆయనను మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ పరిణామం సీమ వైసీపీలో కొంత జోష్ నింపిందన్న వాదన వినిపిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా.. పార్టీ పరంగా ఉద్యమాలు చేపట్టినా.. పెద్దిరెడ్డి పెద్దగా యాక్టివ్ కాలేదు. కుటుంబంపై నమోదైన కేసులు ఆయనను ఇబ్బందికి గురి చేశాయన్న వాదన ఉంది ముఖ్యంగా భూములు, మద్యం, అటవీ భూమిని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారన్న కేసులు కూడా నమోదయ్యాయి. అయితే.. వాటిపై పార్టీ పరంగా ఆయనకు మద్దతు లభించలేదు. దీంతో పెద్దిరెడ్డి కినుక వహించారని.. పార్టీలో కూడా అన్యమనస్కంగా ఆయన ఉంటున్నారన్నది కొన్నాళ్ల కిందటే చర్చకు వచ్చింది. అయితే.. తాజాగా .. పెద్ది రెడ్డి మనసు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోవడం.. నియోజకవర్గంలో కూడా కేడర్ బల హీన పడుతుండడం, నాయకుల మధ్య సమన్వయం సమస్యగా మారుతున్న నేపథ్యంలో ఉద్యమాలకు హాజర య్యారన్న టాక్ వినిపిస్తోంది. పెద్దిరెడ్డి ఇప్పటి వరకు కేవలం ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలకు మాత్రమే పరిమితం అయ్యారు. గతంలో చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. గత 2024 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలని నిర్ణయించారు. కానీ, ఈ తరహా రాజకీయాలు పనిచేయలేదు. దీంతో గత ఎన్నికల తర్వాత నుంచి పెద్దిరెడ్డి మౌనంగా ఉండిపోయారు. ఒకవైపు మదనపల్లి ఫైల్స్ తగలబడడం, మద్యం కేసు వెంటాడడం, భూముల వ్యవహారంతో తీరికలేకుండా పోయింది. మరోవైపు మరిన్ని కేసులు నమోదవుతాయన్న బెంగ కూడా ఆయనను వెంటాడింది.ఈ పరిణామాల క్రమంలో మౌనంగా ఉన్న పెద్దిరెడ్డి.. తాజాగా యాక్టివ్ కావడం కొంత మేరకు సీమలో వైసీపీకి కలిసి వస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఇది కొనసాగుతుందా? లేదా? అనేది చూడాలి. కేవలం తాడిపత్రి వరకే పెద్దిరెడ్డి రాజకీయంగా పరిమితం అవుతారా? అనేది కూడా సందేహంగా మారింది. అయితే.. ఇది కొంత మేరకు సానుకూల పరిణామాలను అందిస్తున్నదన్న సంకేతాలు కూడా ఉన్నాయి. సీమలో పెద్ది రెడ్డి వంటి సీనియర్ యాక్టివ్ కావాలని కోరుకునే వారికి మాత్రం తాజా పరిణామం కొంత మేరకు సంతృప్తిని ఇచ్చిందని అంటున్నారు.

# పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

గోదావరిఖని:పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు.విధుల్లో అలసత్వం,నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు,నిందితుల అరెస్టులు,దర్యాప్తు పురోగతి,నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న, పాత కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని,వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ 2.0లో ప్రతి కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు,దర్యాప్తు అధికారులు సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. నిందితుల అరెస్టుల్లో ఎలాంటి జాప్యం చేయరాదని ఆదేశించారు. తీవ్రమైన నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరాల పెరుగుదలకు సంబంధించిన కేసులు,కీలక నివేదికల పెండింగ్ అంశాలపై డీసీపీలు, ఏసీపీలు తమ పరిధిలోని కేసులను సీసీటీఎన్ఎస్ ద్వారా క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-సమన్లను త్వరితగతిన పరిష్కరించి,వాటి పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.ఆస్తి సంబంధిత కేసులు,చిట్‌ఫండ్, ఆర్థిక నేరాలు, సీఎంఆర్ బియ్యం అక్రమ మళ్లింపు కేసుల్లో ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, నిందితుల అరెస్టులు తదితర పెండింగ్ అంశాలను సమీక్షించారు.ఆర్థిక నేరాల్లో ఆస్తుల గుర్తింపు,స్వాధీనం, జప్తుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్థిక నేరాల కేసుల్లో నిబంధనల ప్రకారం ఆస్తుల జప్తు ప్రక్రియను తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు.కొత్త నేర న్యాయ చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఇతర రాష్ట్రాలు,జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ కేసుల దర్యాప్తులో అవసరమైన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని ఆదేశించారు.సైబర్ నేరాలు, సమాచార సాంకేతికతకు సంబంధించిన కేసులను నిర్దేశిత ప్రామాణిక విధానాల ప్రకారం నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జీఆర్ఎం,ఎంఆర్ఎం పనితీరును మెరుగుపరుచుకోవాలని,సమన్వయ పోర్టల్‌పై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.ప్రతి ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరై తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు.గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పేకాట,ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ తరలింపు తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది 24 గంటలూ, వారంలో ఏడు రోజులూ ప్రజలకు అందుబాటులో ఉ ండటం తమ ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని సీపీ తెలిపారు.సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు.నేరం జరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి,ప్రజల ఫిర్యాదులను స్వీకరించి,వారికి పోలీసులపై నమ్మకం, భరోసా కలిగేలా వ్యవహరించాలని ఆదేశించారు.పోలీసుల ప్రవర్తనే పోలీస్ శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని సీపీ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యానికి ఎలాంటి తావివ్వకూడదని తెలిపారు. అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్.శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, సైబర్ క్రైమ్ ఏసీపీ రంగారెడ్డి,ఏఆర్ ఏసీపీ ప్రతాప్‌తో పాటు ఇతర సీఐలు,ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలివిధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు: సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రజా క్రాంతి, గోదావరిఖని :పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు.విధుల్లో అలసత్వం,నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు,నిందితుల అరెస్టులు,దర్యాప్తు పురోగతి,నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న, పాత కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని,వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ 2.0లో ప్రతి కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు,దర్యాప్తు అధికారులు సకాలంలో నమోదు



చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. నిందితుల అరెస్టుల్లో ఎలాంటి జాప్యం చేయరాదని ఆదేశించారు. తీవ్రమైన నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరాల పెరుగుదలకు సంబంధించిన కేసులు,కీలక నివేదికల పెండింగ్ అంశాలపై డీసీపీలు, ఏసీపీలు తమ పరిధిలోని కేసులను సీసీటీఎన్ఎస్ ద్వారా క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-సమన్లను త్వరితగతిన పరిష్కరించి,వాటి పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.ఆస్తి సంబంధిత కేసులు,చిట్‌ఫండ్, ఆర్థిక నేరాలు, సీఎంఆర్ బియ్యం అక్రమ మళ్లింపు కేసుల్లో ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, నిందితుల అరెస్టులు తదితర పెండింగ్ అంశాలను సమీక్షించారు.ఆర్థిక నేరాల్లో ఆస్తుల గుర్తింపు,స్వాధీనం, జప్తుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్థిక నేరాల కేసుల్లో నిబంధనల ప్రారం ఆస్తుల జప్తు ప్రక్రియను తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు.కొత్త నేర న్యాయ చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఇతర రాష్ట్రాలు,జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ కేసుల దర్యాప్తులో అవసరమైన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని ఆదేశించారు.సైబర్ నేరాలు, సమాచార సాంకేతికతకు సంబంధించిన కేసులను నిర్దేశిత ప్రామాణిక విధానాల ప్రకారం నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జీఆర్ఎం,ఎంఆర్ఎం పనితీరును మెరుగుపరుచుకోవాలని,సమన్వయ పోర్టల్‌పై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.ప్రతి ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరై తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు.గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పేకాట,ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ తరలింపు తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది 24 గంటలూ, వారంలో ఏడు రోజులూ ప్రజలకు అందుబాటులో ఉ ండటం తమ ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని సీపీ తెలిపారు.సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు.నేరం జరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శిపెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలివిధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు: సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రజా క్రాంతి, గోదావరిఖని :పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు.విధుల్లో అలసత్వం,నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు,నిందితుల అరెస్టులు,దర్యాప్తు పురోగతి,నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న, పాత కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని,వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ 2.0లో ప్రతి కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు,దర్యాప్తు అధికారులు సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. నిందితుల అరెస్టుల్లో ఎలాంటి జాప్యం చేయరాదని ఆదేశించారు. తీవ్రమైన నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరాల పెరుగుదలకు సంబంధించిన కేసులు,కీలక నివేదికల పెండింగ్ అంశాలపై డీసీపీలు, ఏసీపీలు తమ పరిధిలోని కేసులను సీసీటీఎన్ఎస్ ద్వారా క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-సమన్లను త్వరితగతిన పరిష్కరించి,వాటి పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.ఆస్తి సంబంధిత కేసులు,చిట్‌ఫండ్, ఆర్థిక నేరాలు, సీఎంఆర్ బియ్యం అక్రమ మళ్లింపు కేసుల్లో ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, నిందితుల అరెస్టులు తదితర పెండింగ్ అంశాలను సమీక్షించారు.ఆర్థిక నేరాల్లో ఆస్తుల గుర్తింపు,స్వాధీనం, జప్తుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్థిక నేరాల కేసుల్లో నిబంధనల ప్రకారం ఆస్తుల జప్తు ప్రక్రియను తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు.కొత్త నేర న్యాయ చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

# విశాఖలో ఫుడ్ బ్యాంకులు

విశాఖపట్టణం,విశాఖపట్నంలో పోలీసులు కమ్యూనిటీ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో నగరంలో ఆగస్టు 15న ఈ ఫుడ్ బ్యాంకులు ప్రారంభిస్తున్నారు. విశాఖ నగర సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనతో నగరంలోని ఐదుచోట్ల ఈ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో వీటిని నిర్వహిస్తారు. అలాగే ఎవరైనా ఆహారం తీసుకొచ్చి ఫ్రిజ్‌లో పెట్టొచ్చు. ఈ ఫుడ్ ఫ్రీ.. ఎవరైనా తినొచ్చు. నగరంలో ఎవరూ ఆకలితో ఉ ండకూడదనే లక్ష్యంతో హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 15న నగరంలో ఐదుచోట్ల ఫ్రిజ్‌లతో ఈ ఫుడ్ బ్యాంకుల్ని ప్రారంభించబోతున్నారు. నగరంలోని హోటల్స్, కేటరింగ్ నిర్వాహకులుతో పాటుగా ఎవరైనా ప్రత్యేక సందర్భాల్లో ఫుడ్ డొనేట్ చేసేందుకు ముందుకు వచ్చేవారి సహకారంతో వీటిని నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి ఐదుచోట్లు ప్రారంభిస్తున్నా.. రాబోయే రోజుల్లో నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.ఈ నెల 15న నగరంలోని రైల్వే స్టేషన్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్ బస్‌స్టేషన్, మద్దిలపాలెం, గాజువాక ప్రాంతాల్లో ప్రారంభిస్తున్నారు. ఈ ఐదుచోట్ల ప్రత్యేకంగా ఒక షెడ్ ఏర్పాటు చేసి.. అక్కడ ఓ రిఫ్రిజిరేటర్‌ను అందుబాటులో ఉంచుతారు. అక్కడ నాణ్యమైన, తాజా ఆహారాన్ని అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేశారు. ప్రతిరోజూ హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో మూడు పూటలా ఆహారాన్ని అక్కడ ఉంచుతారు. ఆయా ప్రాంతాల్లో ఇలా ఫుడ్ బ్యాంకులకు ఆహారం అందించేవారిని గుర్తించారు. ఒకవేళ ఎవరైనా బర్త్ డే, పెళ్లిరోజు, ఇతర ముఖ్యమైన సందర్భాల్లో ఫుడ్ పంపిణీ చేయాలనుకుంటే.. ఫుడ్‌బ్యాంక్ ద్వారా అవసరమైన వారికి అందజేస్తారు. మిగిలిపోయిన, పాడైపోయిన, సగం తినేసి వదిలేసిన ఆహారాన్ని తీసుకురావద్దని బోర్డులు ఏర్పాటు చేస్తారు.ఈ ఫుడ్‌బ్యాంకులకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతల్ని స్థానికంగా ఉండే కంట్రోల్ రూమ్ సీఐలకు సీపీ అప్పగించారు. ఒకవేళ ఎవరైనా ఫుడ్ బ్యాంకుకు ఆహారం అందజేయాలి అనుకుంటే స్థానికంగా ఉండే పోలీసుల్ని, ప్రత్యేకంగా ఒక మొబైల్ నంబర్ కేటాయించి ఫుడ్ బ్యాంకుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఆకలితో ఇబ్బందిపడేవారికి ఈ ఫుడ్ బ్యాంకులు ఎంతో ఉపయోగంగా ఉంటాయని భావిస్తున్నారు. అందుకే ఈ హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనపై విశాఖవాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్

తిరుమల,తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్ పెడుతూ టీటీడీ కొత్తగా నిర్మించిన రెండు వసతి సముదాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుపతిలో భక్తుల కోసం నిర్మించిన శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ రెండు వసతి సముదాయాలలో దాదాపు 10,000 మంది భక్తులకు వసతి కల్పించవచ్చు. మొత్తం వెయ్యికిపైగా గదులు అందుబాటులోకి రానున్నాయి.. తిరుమలలో 60 వేల మంది యాత్రికులకు వసతి కల్పించేలా 7600 గదులు, 5 పీఏసీలు ఉన్నాయి. తిరుమలలో ప్రస్తుతం ఉన్న వసతి గదులు భక్తులకు సరిపోవడం లేదు.. అలాగని కొత్తగా అక్కడ సముదాయాలు నిర్మించలేని పరిస్థితులు ఉన్నాయి. ఒకవేళ తిరుమలలో వసతి గదులు దొరకకపోతే భక్తుల కోసం తిరుపతిలో శ్రీనివాసం, మాధవం, విష్ణునివాసం, పద్మావతి అతిథి గృహం ఉన్నాయి. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో వసతి గదులు సరిపోవడం లేదు.. ఈ సమస్యకు చెక్ పెట్టేలా కొత్తగా నిర్మించిన మరో రెండు వసతి సముదాయాలు అందుబాటులోకి రాబోతున్నారు.తిరుపతి రైల్వే స్టేషన్ వెనుక గోవిందరాజస్వామి సత్రాల స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల పనులు ముగింపు దశకు వచ్చాయి. ప్రధాన భవనాలు, గదుల నిర్మాణం పూర్తికాగా.. విద్యుత్, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో జరగబోయే బ్రహ్మోత్సవాల సమయంలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను దాదాపు రూ.600 కోట్ల వ్యయంతో, అధునాతన వసతులతో నిర్మిస్తున్నారు. ఈ శ్రీపాదం, అచ్యుత భవనాలు తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు చొప్పున మొత్తం 1064 గదులు ఉంటాయి.. ఈ రెండు సముదాయాలలో కలిపి 10వేల మంది భక్తులకు వసతి కల్పించవచ్చు.అచ్యుతం, శ్రీపాదం వసతి సముదాయాల్లోని భవనాల్లో రిసెప్షన్, అన్నదానం, డార్మెటరీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.. దాదాపు 7వేల మంది భక్తులకు సరిపోయేలా లాకర్ల సౌకర్యం కూడా అందుబాటులోకి రానుంది. ఈ రెండు వసతి సముదాయాల నిర్మించాలని 2022లో అప్పటి టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. కానీ నిర్మాణ పనులు 2024 మార్చిలో ప్రారంభంకాగా.. 2026 ఏప్రిల్‌కు పూర్తి చేయాలని భావించారు. కానీ పనులు కాస్త ఆలస్యం కావడంతో బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

## ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ద్వారా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

హైదరాబాద్,తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను మాన్యువల్ విధానం నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లకు మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలి దశలో 15 ఏటీఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ట్రక్కులు, బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలను సెన్సర్ల ద్వారా పరీక్షిస్తారు. బ్రేకింగ్ సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, కాలుష్య ఉద్గారాలు, ఇతర సాంకేతిక ప్రమాణాలను మెషీన్లు ఆటోమెటిక్‌గా అంచనా వేస్తాయి. ఫలితాలను కేంద్ర వాహన్ పోర్టల్‌లో నేరుగా నమోదు చేస్తారు. కాగా, ఈ ఏటీఎస్ కేంద్రాలను 37 ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో వాహనాల రోడ్డు ఫిట్‌నెస్ పరీక్షల విధానంలో కీలక మార్పు రానుంది. ఇప్పటివరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో మాన్యువల్‌గా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ టెస్టుల స్థానంలో ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) అందుబాటులోకి రానున్నాయి. వాహనం రోడ్డుపై నడవడానికి సురక్షితంగా ఉందా లేదా అన్నది ప్రత్యేక సెన్సర్లు, యంత్రాల ద్వారా శాస్త్రీయంగా పరీక్షించి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. రవాణా శాఖ తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. తొలి దశలో ఏర్పాటు చేసే కేంద్రాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కార్యాలయాల పరిధిలో రెండు క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఈ నెట్‌వర్క్‌ను మొత్తం 37 ప్రతిపాదిత ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఏటీఎస్‌లో వాహనాన్ని ప్రత్యేక సెన్సర్లతో కూడిన పరికరాలపై నడిపిస్తారు. ఈ ప్రక్రియలో బ్రేకులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి, ఇంజిన్ పనితీరు ఎలా ఉంది, వాహనం నుంచి వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా వంటి అంశాలను ఆటోమేటిక్‌గా పరీక్షిస్తారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన ఇతర సాంకేతిక ప్రమాణాలను కూడా యంత్రాల ద్వారా పరిశీలిస్తారు.

# రెంటికి చెడ్డ రేవడిలా ఆ 10 మంది



హైదరాబాద్,రాజకీయాల్లో గోడ దూకిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యి లా తయారైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి తమ నియోజకవర్గాలను డెవలప్ చేసుకుందామనో, లేక రాజకీయ భవిష్యత్తును సురక్షితం చేసుకుందామనో భావించి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఈ పది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రస్తుతం సంతోషంగా లేరనేది పొలిటికల్ వర్గాల్లో సాగుతున్న ప్రచారం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వంటి కొందరు నేతలు తమ ఆవేదనను బహిరంగంగానే వెళ్లగక్కుతుండగా, మిగిలిన వారు లోలోపల రగిలిపోతూ ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ ఎమ్మెల్యేల ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన మూలకారణం.. వీరిని కాంగ్రెస్ పార్టీ సాంకేతికంగా, చట్టబద్ధంగా, అధికారికంగా తమలో విలీనం చేసుకోలేకపోవడమే. వీరు కాంగ్రెస్‌లో చేరలేదని స్పీకర్ తీర్పిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మా ఎమ్మెల్యేలు అయితే మా పార్టీ సమావేశాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నిస్తోంది. కోర్టులు, ఎన్నికల సంఘం లేదా సాంకేతిక విచారణల ముందుకు వచ్చినప్పుడు.. మేము కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం మా నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కోసమే ముఖ్యమంత్రిని వినతిపత్రాలతో కలిశాం అని స్వయంగా వాంగ్మూలాలు ఇచ్చుకోవాల్సిన విచిత్రమైన, ఆత్మవంచన చేసుకునే పరిస్థితి వీరికి ఏర్పడింది. కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరడం వల్ల వీరు ఒకవైపు బీఆర్ఎస్ పార్టీలో దశాబ్దాలుగా అనుభవించిన హోదా, హక్కులు, కార్యకర్తలపై ఉన్న పట్టును పూర్తిగా కోల్పోయారు. మరోవైపు, అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనే ముద్ర పడకపోవడంతో ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యతా లభించడం లేదు. ఇటు బీఆర్ఎస్‌పై హక్కు లేక, అటు కాంగ్రెస్‌లో చట్టబద్ధమైన గుర్తింపు రాక రాజకీయంగా వీరు పూర్తిగా 'రెంటికి చెడ్డ రేవడి'లా మారిపోయారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు వస్తాయని, పనులు శరవేగంగా జరుగుతాయని ఆశించిన ఈ నేతలకు నిరాశే ఎదురవుతోంది. సొంత కాంగ్రెస్ నియోజకవర్గాలకే నిధుల కొరత వేధిస్తున్న తరుణంలో, ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత లభించడం లేదు. చివరకు తమ నియోజకవర్గాల చిన్న చిన్న పనుల కోసం మంత్రులను, అధికారులను కలవాలన్నా, లేదా చివరకు నిధుల కోసం ఫోన్ చేసినా అధికారులు, కాంగ్రెస్ పెద్దలు ఫోన్లు ఎత్తడం లేదని సదరు ఎమ్మెల్యేలు తమ అనుచరుల వద్ద తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పది మందిలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వంటి వారు పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించి, మెల్లగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరమై తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించారు. కానీ, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాష్ గౌడ్ వంటి మిగిలిన నేతలు ఇటు వెనక్కి వెళ్లలేక, అటు ముందుకూ సాగలేక తీవ్రమైన మానసిక సంఘర్షణను అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ కేడర్ కూడా వీరిని తమ సొంత నేతలుగా స్వీకరించకపోవడం, పాత కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు వీరికి వ్యతిరేకంగా గ్రూపులు కట్టడం వీరి పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. సొంత పార్టీని వీడి అధికార పక్షంలోకి వెళ్తే అన్నీ బాగుంటాయని అనుకున్న ఈ ఎమ్మెల్యేలకు ప్రస్తుత పరిణామాలు ఒక పెద్ద రాజకీయ పాఠంగా మారాయి. ప్రజామోదం పొందిన పార్టీకి దూరమై, సాంకేతిక చట్టాల చిక్కుల్లో పడి, అధికారంలో ఉన్న పార్టీ నుంచి సరైన గుర్తింపు పొందని ఈ పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది.

# తెలంగాణకు జనసేన ముఖ్యమంత్రి!

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో జనసేన పాత్రపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే అవకాశాలు ఉన్నాయని, వచ్చే మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సూచించారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన భవిష్యత్తుపై రాజాసింగ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2014 నుంచి తెలంగాణ రాజకీయాల్లో శూన్యత నెలకొందని, జనసేన ఆ శూన్యతను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజాసింగ్ వ్యాఖ్యానించారు తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు ఉండదంటూ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రామచంద్రరావు ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో తాజాగా రాజాసింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ఆదరణ ఉందని, జనసేన పార్టీకి మద్దతు పెరుగుతోందని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా అత్యంత కీలక పరిణామానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రాజాసింగ్ ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారనేది స్పష్టంగా తెలియకపోయినా, తెలంగాణ రాజకీయాల్లో జనసేనను ఓ వర్గం కోరుకుంటుంది అనే సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టేలా జనసేనాని ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని రాజాసింగ్ కోరారు. ఇదే సమయంలో ఆయన తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్షంలోని బీఆర్ఎస్, బీజేపీపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా



పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని రాజాసింగ్ ఆరోపించారు. అదే సమయంలో బీజేపీలో పరిస్థితులు ఏమంత బాగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన గట్టిగా పనిచేస్తే తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని సంచలన విశ్లేషణ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చూసిన జనాలు విసిగిపోయారని, బీజేపీ అంతర్గత రాజకీయాలు వల్ల అధికారంలోకి వచ్చే అవకాశం లేదని రాజాసింగ్ విశ్లేషించారు. ప్రస్తుతం ఈ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోందని, తన అంచనాల ప్రకారం వచ్చే ఎన్నికల్లో జనసేన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్ పై పోటీ చేసిన రాజాసింగ్ గత ఏడాది ఆ పార్టీకి రాజీనామా చేశారు. హిందుత్వవాదిగా ముద్రపడిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలతో జనసేనాని పవన్ కు దగ్గరయ్యే సంకేతాలిస్తున్నారని పరిశీలకులు అనుమానిస్తున్నారు.

# టార్గెట్ రేవంత్...

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణల పర్వం కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా నేరుగా విమర్శలు చేయడం కంటే, ఆయన కుటుంబ సభ్యులను, ముఖ్యంగా ఆయన సోదరులను టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. రేవంత్ రెడ్డి సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిలు సాధారణంగా తెర వెనుక ఉంటారు. తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ వ్యవహారాలు చూసుకుంటుండగా, కొండల్ రెడ్డి వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. వీరిద్దరినీ ఇప్పుడు బీఆర్ఎస్ తమ పొలిటికల్ అటాక్‌కు కేంద్రబిందువుగా మార్చుకుంది. తాజాగా ఈ పొలిటికల్ వార్ టెస్సరాక్ట్ అనే కంపెనీకి జరిగిన భూ కేటాయింపుల చుట్టూ తిరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ కంపెనీకి అత్యంత విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టిందని, అసలు ఆ టెస్సరాక్ట్ కంపెనీ కొండల్ రెడ్డి బినామీ సంస్థ అని బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ముఖ్యమంత్రి తన అధికారాన్ని ఉపయోగించి సొంత సోదరుడికి భారీగా లబ్ధి చేకూర్చారని ప్రతిపక్ష నేతలు సోషల్ మీడియా, మీడియాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచార దాడికి దిగారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థాయి స్కామ్‌లకు పాల్పడుతోందంటూ బీఆర్ఎస్ శ్రేణులు నెరేటివ్‌ను బలంగా జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. బీఆర్ఎస్ చేస్తున్న ఈ తీవ్రమైన ఆరోపణలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలోని సీనియర్ నేతలు, మంత్రులు ఎవరూ ఈ వివాదంపై పెద్దగా స్పందించకపోవడం ప్రతిపక్షాల ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాత్రమే ఈ అంశంపై స్పందిస్తూ ప్రభుత్వాన్ని డిఫెండ్ చేసే ప్రయత్నం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక విధానం ప్రకారం ఎలాంటి నిబంధనలతో భూములు కేటాయించారో, ఇప్పుడు కూడా సరిగ్గా అదే చట్టబద్ధమైన రూల్స్ పాటిస్తూ పారదర్శకంగా భూములు ఇచ్చామని, ఇందులో ఎలాంటి తప్పిదాలు జరగలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. అయితే, ఇక్కడే కాంగ్రెస్ వ్యూహాత్మక లోపం బయటపడుతోంది. పారిశ్రామిక అవసరాల కోసం ఇచ్చిన భూములను కేవలం ఆ నిర్దేశిత ప్రాజెక్టులకు, ఫ్యాక్టరీల నిర్మాణాలకు మాత్రమే ఉపయోగించాలి



తప్ప, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చుకోవడానికి లేదా అమ్ముకోవడానికి చట్టపరంగా అవకాశం ఉండదు. ఈ పాయింట్‌ను కాంగ్రెస్ నేతలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారు. భూములు ఎవరికి ఇచ్చినా అందులో స్కామ్ చేసే ఆస్కారం లేదని టెక్నికల్‌గా వివరించడంలో అధికార పక్షం విఫలమవుతోంది. సదరు టెస్సరాక్ట్ కంపెనీకి, సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ శ్రేణులు కానీ, ప్రభుత్వ ప్రతినిధులు కానీ ధైర్యంగా ఖండించలేకపోతున్నారు. బీఆర్ఎస్ ప్రధానంగా కొండల్ రెడ్డి పేరును వాడుకుని దీనిని ఫ్యామిలీ స్కామ్ గా బ్రాండ్ చేస్తోంటే.. కాంగ్రెస్ మాత్రం కేవలం విధానపరమైన నిబంధనల గురించి మాత్రమే మాట్లాడుతోంది తప్ప, అసలు ఆ కంపెనీ ఓనర్ల వెనుక కొండల్ రెడ్డి ఉన్నారా లేదా అనే దానిపై క్లారిటీ ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కచ్చితమైన ఖండన లేకపోవడం వల్లే బీఆర్ఎస్ తమ ప్రచారంలో మరింత దూకుడు పెంచుతోంది. కేటీఆర్ అండ్ కో ఈ ఇష్యూ ద్వారా రెండు ప్రయోజనాలను ఆశిస్తున్నారు. ఒకటి.. గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతిపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలకు కౌంటర్‌గా, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబం కూడా అదే చేస్తోందని ముద్ర వేయడం. రెండు.. సీఎం ఇమేజ్‌ను డ్యామేజ్ చేసి, ప్రభుత్వంపై నెగెటివిటీ పెంచడం. కాంగ్రెస్ పార్టీ ఈ ఆరోపణల దాడిని కేవలం మంత్రుల ప్రకటనలకే పరిమితం చేయకుండా, వాస్తవాలను డాక్యుమెంట్ల సహా ప్రజల ముందు ఉంచి కౌంటర్ అటాక్ చేయకపోతే.. దీర్ఘకాలంలో ఇలాంటి చిన్న సైజు స్కామ్ ఆరోపణలే ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది.

# గ్రేటర్ పోరులో పార్టీలు...

హైదరాబాద్, తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టాయి. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావాలని నిర్ణయించడం గమనార్హం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇదే వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. వాస్తవానికి.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు క్షేత్రస్థాయిలో బలంగానే ఉన్నాయన్న వాదన ఉంది. బీజేపీకి మాత్రమే హైదరాబాద్ సహా.. కొన్ని జిల్లాల్లో బలం ఉన్నా.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడే ఉంది బీజేపీ సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా పార్టీ పెద్దలు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణను దక్కించుకునేందుకు రెడీగా ఉన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో వారి అంచనాలకు అనుగుణంగా కార్యకర్తలు బలోపేతం కావడం లేదు. పార్టీ నాయకుల మధ్య కూడా సఖ్యత కనిపించడం లేదు. ఈ పరిణామాలను సరిదిద్దుకునేందుకు బీజేపీ సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు పార్టీ చీఫ్ రామచందర్‌రావు.. చర్యలు చేపట్టారు. ఇక, సంస్థాగతంగా బాగానే ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు కూడా.. ఈదిశగానే అడుగులు వేయడం ఏంట నేది చర్చకు దారితీస్తోంది. దీనికి ప్రధానంగా ఒకపార్టీపై మరో పార్టీ చేసుకుంటున్న విమర్శలు.. వేసుకుం టున్న నిందలే కారణమని అంటున్నారు పరిశీలకులు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని, కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను కూడా నీరు గారుస్తోందని, రైతులు ఉసూరుమంటున్నారని.. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న విషయం




తెలిసిందే. దీని నుంచి తమను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇక, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం.. ముఖ్యంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ కేంద్రంగా సాగుతున్న విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా ఉంది. ఇక, ఉమ్మడి సమస్యల విషయానికి వస్తే.. క్షేత్రస్థాయిలో చిన్నా చితకా పార్టీల ఆవిర్భావం.. వాటి వల్ల తమ ఓటు బ్యాంకు ప్రభావితమయ్యే పరిస్థితిని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు.. క్షేత్రస్థాయి కార్యకర్తలను కాపాడుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాయి

# వర్షాకాల పార్లమెంట్ ఖర్చు...వామ్మో అనాల్సిందే !



న్యూఢిల్లీ,చట్ట సభలు అంటే చర్చలకు వేదికగా ఉంటాయి. ప్రజా సమస్యలను అక్కడ చర్చిస్తారు. కోట్లాది మంది ప్రజల అంతరంగాన్ని ఆవిష్కరించే పవిత్ర వేదికగా పార్లమెంట్ ని అసెంబ్లీని చూస్తారు. లక్షలాది మంది ప్రజలు తమ తరఫున ప్రజా ప్రతినిధిని ఎన్నుకుని ఓటేసి పంపిస్తారు. అలా వచ్చిన వారు తమ నియోజకవర్గం సమస్యలు అక్కడ ప్రస్తావించి సరైన పరిష్కారం రాబడితే సార్ధకత చేకూరుతుంది. అంతే కాదు పార్లమెంట్ అయితే దేశానికి సంబంధించి కీలక నిర్ణయాలు సభ్యుల అందరి సలహా సూచనలతో తీసుకోవడం ద్వారా ప్రగతి బాటలు వేయాల్సి ఉంటుంది. అసెంబ్లీలు అయితే రాష్ట్ర ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ సభలో చర్చలు జరపాల్సి ఉంది.

సభ అంటే రభసేనా :

అయితే చట్ట సభలు ఆ దిశగా సాగుతున్నా అంటే జవాబు అందరికీ తెలిసిందే. మధ్యలో రాజకీయం చొరబడుతోంది. ఒకసారి ఎవరైనా ప్రజా ప్రతినిధి అయ్యాక అయిదేళ్ళ వరకూ ఎన్నికలూ రాజకీయాలు ప్రస్తావన లేకుండా ప్రజలు వారి సమస్యలు పరిష్కారాలు అభివృద్ధి మీదనే దృష్టి కేటాయించాల్సి ఉంటుంది. ఒకరు అధికారంలో ఉంటారు, ఇవతల విపక్షంలో కొన్ని పార్టీలు ఉంటాయి. అందరి లక్ష్యం అంతిమంగా ప్రజా ప్రయోజనాలే కావాలి. కానీ అలా లేకపోవడమే బాధాకరం అని అంటున్నారు. చట్ట సభలు వేదికగా రాజకీయ సవాళ్ళు ప్రతి సవాళ్ళు చోటు చేసుకుంటున్నాయి. తమ డిమాండ్లు పట్టుదల కోసం సభా సమయాన్ని వృధాగా చేస్తున్నారు. అంతే కాదు సభను వాయిదాలు వేయించేలా గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దాంతో సజావుగా సభలు సాగడం లేదు.

ప్రజల పన్నులతోనే :

పార్లమెంట్ అయినా అసెంబ్లీ అయినా నడిచేది ప్రజలు కట్టే పన్నులతోనే. చట్ట సభలు ఒక రోజు నడవాలీ అంటే కోట్లలోనే ఖర్చు అవుతుంది. అదంతా ప్రజా ధనం అని వేరేగా చెప్పాల్సిన పని లేదు. ఇక చూస్తే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారంతో ముగిసాయి. మొత్తం పందొమ్మిది పని దినాలుగా ఈ సెషన్ ని నిర్వహిస్తే ఒక్క రోజు కూడా సజావుగా సభ సాగకపోవడం విశేషం. మరి ఈ పార్లమెంట్ వర్షాకాల సెషన్ కోసం అయిన ఖర్చు ఎంతో తెలిస్తే ఎవరైనా నోళ్ళు వెళ్లబెడతారు. ఈ మొత్తం పందొమ్మిది రోజులకు కలిపి రెండు వందల కోట్ల రూపాయలకు పైగానే ఖర్చు అయినట్లుగా చెబుతున్నారు.

నిముషానికి లక్షలే :

అంతే కాదు పార్లమెంట్ సమావేశాల నిర్వహణకు ప్రతి నిమిషానికి సుమారు రూ. 2.5 లక్షలు ఖర్చవుతుంది. సాధారణ అంచనాల ప్రకారం పార్లమెంట్ సభల నిర్వహణకు రోజుకు దాదాపు రూ. 9 కోట్లు ఖర్చు అవుతుంది. అంటే నిమిషానికి: రూ. 2.5 లక్షలు గంటకు రూ. 1.5 కోట్లు రోజుకు 9 కోట్లు ఇలా సభ జరిగే రోజుల బట్టి ఈ ఖర్చులు పెరుగుతూ ఉంటార్యు. వీటితో పాటు ఎంపీల జీతభత్యాలు, భద్రత, సిబ్బంది ఖర్చులు భవన నిర్వహణ వంటివి ఉంటాయి. ఇక సభలో గందరగోళం కారణంగా వాయిదాలు పడితే, ఆ వృధా అయిన సమయానికి కూడా ఇదే ప్రాతిపదికన కోట్లాది రూపాయల ప్రజాధనం నష్టం జరుగుతుంది.

అంతా కట్టుబడి ఉండాలని :

మరి ఇంత పెద్ద ఎత్తున ప్రజా ధనం వెచ్చించి నిర్వహించే సభలలో అర్ధవంతమైన చర్చలు జరగకపోతే నష్టం ఎవరికి అంటే కచ్చితంగా ప్రజలకే అని చెప్పాల్సి ఉంటుంది. అధికార విపక్షాలు పట్టుదలకు పోతూ సభా సమయాన్ని వృధాగా పోనిస్తున్నాయని విమర్శలు ఉన్నాయి. ప్రజా స్వామ్య ప్రియులు అయితే ఈ వైఖరి మంచిది కాదని అంటున్నారు. బీఏసీలో అంశాలకు అంతా కట్టుబడి ఉండాలని అంటున్నారు. అలాగే విపక్షాలు అత్యవసరం అని ఏదైనా అంశాన్ని మధ్యలో సూచించినా దాని ప్రాధాన్యత బట్టి తీసుకుంటే సభలో గందరగోళం వంటివి తగ్గుతాయని సూచిస్తున్నారు. మరి ఈసారి జరిగే సమావేశాలు అయినా సాఫీగా తాపీగా జరుగుతాయని ఆశించడమే సగటు భారతీయ పౌరుల కర్తవ్యంగా చెప్పాలి.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు రికవరీ

హైదరాబాద్ :పాతబస్తీ ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాలలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితుల ఫిర్యాదు రావడంతో అ ఫిర్యాదు పై ఛత్రినాక ఇన్ స్పెక్టర్ కోటేశ్వరరావు, ఛత్రినాక డిఐ, కృష్ణమూర్తి నాయుడు, డిటెక్టివ్ ఎస్సై, మహమ్మద్ మాజీద్ అలీ, తో పాటు క్రైమ్ టీం సిబ్బంది కలిసి ,మొబైల్ ఫోన్ యొక్క ఐ,ఎం,ఈ, ఐ ,నెంబర్ ప్రకారం కొత్తగా వచ్చిన (సి,ఐ,ఆర్ )ప్రోటల్ ద్వారా (21)ఫోన్లను రికవరీ చేసి వాటికి సంబంధించిన వ్యక్తులను ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఛత్రినాక ఇన్ స్పెక్టర్ కోటేశ్వరరావు, డిఐ, కృష్ణమూర్తి నాయుడు చేతుల మీదుగ (21) మంది బాధితులకు సెల్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఛత్రినాక ఇన్ స్పెక్టర్ కోటేశ్వరరావు, మాట్లాడుతూ ప్రజలు పోగొట్టుకున్న వెంటనే స్థానిక పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయడం వల్ల ద్వారా రికవరీ చేయడం సులభంగా అవుతుందని అన్నారు.

# యోగి బాటలో సువేందు...



కోల్ కత్తా, పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాలుగా నెలకొన్న ధోరణులను సవాలు చేస్తూ సువేందు అధికారి తన పాలనను ఆరంభించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు అనుసరించిన కఠినమైన, చట్టబద్ధమైన విధానాన్ని ఆయన అనుసరిస్తున్నారని విశ్లేషకులు గమనిస్తున్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలల్లోనే పాత సమస్యలపై దృష్టి సారించడం ఈ విధానం ప్రధాన లక్షణం. యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో మాఫియా నెట్‌వర్క్‌లను అణచివేయడం, మహిళలపై దాడులు చేసేవారిపై కఠిన చర్యలు, అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ చర్యలు, అల్లర్ల సమయంలో రాష్ట్రాన్ని శాంతియుతంగా ఉంచడం వంటి అంశాలు గుర్తుంచుకోదగినవి. సువేందు అధికారి కూడా ఇలాంటి సమస్యలపై దృష్టి సారించారు. ఏడు దశాబ్దాలుగా పరిష్కారం కాని అంశాలను త్వరగా అందుకోవడం ఆయన పాలనలో కనిపిస్తోంది. కోల్‌కతా విమానాశ్రయం సమీపంలోని నిర్మాణం విమానాల కదలికకు అడ్డంకిగా మారిన సందర్భంలో కఠిన నిర్ణయం తీసుకోవడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి చర్యలు రాష్ట్రంలో చట్ట పాలనను బలోపేతం చేస్తాయని మద్దతుదారులు వాదిస్తున్నారు. ప్రజా ప్రదేశా ల్లో మసీదులు, ఆలయాలు, చర్చిల నుంచి వచ్చే అధిక శబ్దం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి సమస్యపై యోగి ప్రభుత్వం తీసుకున్న చర్యలను అనుసరిస్తూ, అవసరమైన చోట్ల మైకుల తొలగింపు జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మదరసాలు, మసీదుల వద్ద ఏర్పడే గందరగోళాన్ని తగ్గించే ప్రయత్నం కూడా కొనసాగుతోంది. మంత్రి అగ్నిమిత్ర పాల్ త్వరలో ఫలితాలు కనిపిస్తాయని సూచించారు. ఇది మతాల మధ్య సమాన నియమాలను అమలు చేసే ప్రయత్నంగా చూడవచ్చు. ఈ చర్యలపై ముస్లిం అనుకూల పార్టీలు, కొన్ని మసీదు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సెక్యూలర్ ఫ్రంట్ ఎమ్మెల్యే నౌసాద్ సిద్దీఖీ కుటుంబం నిర్వహించే దర్గా సంబంధిత వ్యక్తులు, కోల్‌కతాలోని నకుడా మసీదు ప్రతినిధులు మైకుల తొలగింపును వ్యతిరేకించారు. సీఎంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం తన విధానంపై స్థిరంగా ఉండటం గమనార్హం. ఇలాంటి వ్యతిరేకత రాజకీయ ధ్రువీకరణకు దారితీసే అవకాశం ఉంది. అయితే చట్టం ముందు అందరూ సమానమనే సూత్రాన్ని నొక్కి చెప్పడం ఈ విధానం యొక్క ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. సువేందు అధికారి పాలన ఇప్పటికే యోగి, హిమంత మాదిరిగా చట్టం, శాంతి, అభివద్ధి నినాదంపై దృష్టి సారించింది. కొన్ని నెలల్లోనే పాత సమస్యలపై చర్యలు తీసుకోవడం ప్రజల్లో ఆశను కలిగించవచ్చు. అయితే దీర్ఘకాలిక విజయం చట్ట అమలు సమానత్వం, పక్షపాత రహిత విధానం, సామాజిక సామరస్యం కాపాడటంపై ఆధారపడి ఉంటుంది. వ్యతిరేక పార్టీలు, మత సంస్థల నుంచి వచ్చే ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించగలిగితే బెంగాల్ రాజకీయాల్లో కొత్త ధోరణి నెలకొనే అవకాశం ఉంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140